క్లుప్తంగా

లక్ష్యంతో ముందుకు సాగాలి



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకు సాగాలని కాకతీయ యూనివర్సిటీ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ వి.రామచంద్రం అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు రామచంద్రం హాజరై మాట్లాడారు. అనంతరం కళాశాల బృందం కేయూ ప్రొఫెసర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ సీహెచ్.దినేష్‌కుమార్, కళాశాల చైర్మన్ నూకల శ్రీరంగరెడ్డి, కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, డైరెక్టర్ డోలి సాధన, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



నెల్లికుదురు: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక కళాశాల ఆవరణంలో శనివారం నిర్వహిచిన అండర్–19 బాలబాలికల జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో కళాశాల విద్యార్థులు బాలికల విభాగం నుంచి ఎం.కల్పన, అక్షిత, బాలల విభాగం నుంచి ఎండి ఆసీఫ్, బి.సాగర్, జి.అన్వేష్ ఎంపికయ్యారు. అక్టోబర్ 2నుంచి 5వరకు నారాయణకేడ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ డాక్టర్ సుధాకర్ తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



కురవి: మండలంలోని బలపాల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం నర్సింహరెడ్డి, పీఈటీ దీటి శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగిన అండర్–17 విభాగం ఫుట్‌బాల్ పోటీలో విద్యార్థులు హేమలత, లెనిన్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, గోపికృష్ణ, సీతారాములు, జయశ్రీ, వెంకటప్పయ్య, మోతీలాల్, రాజేశ్వర్ అభినందించారు.

అశాస్త్రీయంగా హేతుబద్ధీకరణ



తొర్రూరు: ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ప్రభుత్వం అశాస్త్రీయంగా చేపడుతుందని యూపీఎస్‌సీ నాయకులు అన్నారు. జీఓ 25ను సవరించాలని డిమాండ్ చేస్తూ యూపీఎస్‌సీ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలో అన్నారం రోడ్డులో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, కొలుపుల శ్రీనివాస్, తుమ్మ వెంకటేశ్వర్లు, తిరుమలేష్, కొండం జనార్దన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నివాసానికి 'బోయినపల్లి'



నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర ప్లానింగ్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌కు స్వాగతం పలుకుతూ ఎమ్మెల్సీ రవీందర్‌రావు శనివారం బొకే అందించి ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ నివాసంలో కొంత సమయం పలు అంశాలపై ఎమ్మెల్సీతో చర్చించారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన ఉద్యమకారులు



కేసముద్రం: హైదరాబాద్ సెక్రెటేరియట్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని, కేసముద్రం మండలానికి చెందిన ఉద్యమకారులు శుక్రవారం కలిసి మెమోరాండం అందజేశారు. ఉద్యమకారులకు 250గజాల నివాస స్థలం, గౌరవవేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చాగంటి కిషన్, మాంకాల కట్టమల్లు, షేక్ ఖాదర్, దామరకొండ ప్రవీణ్‌కుమార్, దస్రూనాయక్ పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి..

- కనుమరుగవుతున్న సంప్రదాయ ఆటలు
- నాటి గ్రామీణ ఆటలతో పిల్లల్లో మానసిక వికాసం
- ప్రస్తుతం సెల్‌ఫోన్‌లో వీడియో గేమ్‌లు

Sunday Special

పెద్దవంగర: పాశ్చాత్య సంస్కృతి గ్రామీణ క్రీడలను సైతం కొల్లగొట్టింది. పల్లె ఆటలతో మానసిక, శారీరక, ఉల్లాసం, విజ్ఞానం, ఐకమత్యాన్ని పెంపొందే గ్రామీణ ఆటలు కనుమరుగు చేసింది. నాడు ఏ వీధిలో చూసిన సెలవులు వస్తే చిన్నారులు ఆటలు కేరింతలతో సందడిగా ఉండేది. ఉమ్మడితనానికి ప్రతీకగా ఉండేది. కాని నేటి ఆధునిక కాలంలో బొంగరం, గోటీలు, కోతికొమ్మచ్చి, దాగుడు మూతలు, అష్టాచెమ్మా వంటి ఆటలు మచ్చుకైన కనిపించడం లేదు. ప్రస్తుత కాలంలో తల్లిపాలు తాగే పసివాడి చేతిలో సైతం స్మార్ట్‌ఫోన్ దర్శనమిస్తోందంటే పరిస్థితి ఎలా ఉందో అవగతమవుతోంది.

ఇప్పుడంతా సెల్‌ఫోన్ ట్రెండే..

పల్లెల్లో కూడా స్మార్ట్‌ఫోన్స్‌తో ఆడుకోవడం అలవాటైంది. వీడియో గేమ్స్ తప్పా ఆటస్థలాల్లో ఆటలు గాని, వెన్నెల్లో ఆటలు గాని, కోతికొమ్మచ్చి లాంటి సంప్రదాయ ఆటలను పిల్లలు మరిచిపోతున్నారు.



బస్తా పరుగు ఆడుతున్న చిన్నారులు



బంతితో ఆట ఆడుతున్న చిన్నారులు

ప్రస్తుతం విద్యార్థుల చేతుల్లో క్రీడా వస్తువుల కన్నా స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

మారుతున్న తల్లిదండ్రుల ఆలోచన..

ఒకప్పుడు ఇంట్లో ఇబ్బంది పెడుతున్న పిల్లలను పక్కింటి పిల్లలతో కలిసి ఆడుకొమ్మని తల్లిదండ్రులు చెప్పి బయటకు పంపించేవారు. కానీ ఇప్పుడు పిల్లలు మారం చేస్తే సెల్‌ఫోన్ ఇచ్చి కూర్చొబెడుతున్నారు. దీంతో పాత కాలం నాటి ఆటలకు పిల్లలు దూరమవుతున్నారు.

పిల్లల్లో తగ్గిన ఉత్సాహం



పిల్లలు ఉదయం, సాయంత్రం వేళల్లో మైదానంలో ఆడే ఆటలతో వారిలో శరీర దృఢత్వంతోపాటు ఆరోగ్యం, మంచి జ్ఞాపకశక్తి పెరిగి పిల్లలు ఎంతో ఉత్సాహంగా ఉండేవారు. నేడు పిల్లలను బయటకు వచ్చే పరిస్థితి లేదు. తల్లిదండ్రులు తోటి మిత్రులతో శరీరక ఆటలు ఆడేలా పోత్సహించాలి.

– ఇమ్మడి రాజ్‌కుమార్, పల్లె దవాఖాన వైద్యులు, వడ్డెకొత్తపల్లి



అన్నం తింటూ సెల్‌ఫోన్ చూస్తున్న చిన్నారులు

గడువు దాటిన ఎరువులు విక్రయించొద్దు

గార్ల: గడువు తేదీ దాటిన ఎరువులు, పురుగు మందుల దుకాణంలో నిల్వ ఉంచినా, అమ్మిన దుకాణం లైసెన్స్‌ను రద్దు చేస్తామని మహబూబాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకుడు అజ్మీర శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం గార్లలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగుమందుల స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. రైతులకు ఎరువులు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. సంబంధిత బిల్లుపై రైతు సంతకం ఉండాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. వ్యవసాయ అధికారులు ఆమోదించిన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించాలని సూచించారు. ఏడీఏ వెంట వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంతోపాటు రాజోలు, బలపాల గ్రామంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఏడీఏ వి.విజయచంద్ర శనివారం తనిఖీలు చేపట్టారు. షాపుల్లో స్టాక్ రిజిష్టర్లు, గోదాంలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ నరసింహారావు పాల్గొన్నారు.



గార్ల: ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఏ

మరిపెడ/మరిపెడ రూరల్: రైతులకు యూరియా కొరత ఏ మాత్రం లేదని, కావాల్సినంతా యూరియా మార్కెట్‌లో అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి బోడ వీరసింగ్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), ఆగ్రోస్ గౌడన్‌లోని యూరియా నిల్వలను, దిగుమతులు అవుతున్న యూరియాను ఏఓ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీకాంత్, చాపల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని పీఏసీఎస్‌కి చెందిన ఎరువుల గోదాంను ఏఓ వెంకన్న శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కూల్చివేసే కుట్రలను విరమించుకోవాలి

నెహ్రూసెంటర్: జిల్లాలో 'మాద్రా' పేరుతో పేదల ఇళ్లను కూల్చివేసే కుట్రలను విరమించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఎంఆర్‌ఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్న పేదల ఇళ్లను కూల్చివేస్తామంటూ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీను, బోడ లక్ష్మణ్, కొత్తపల్లి రవి, హెచ్.లింగ్యా, భట్టు చైతన్య, పైండ్ల యాకయ్య, దుప్పలి అనిల్‌కుమార్, రజియా, వినోద్‌రెడ్డి, ఎండి.పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ప్రమాణస్వీకారోత్సవం



నెహ్రూసెంటర్: రోటరీ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ 2024–25 నూతన 16వ కమిటీ సమావేశం పూర్వపు అధ్యక్షుడు కొడారి నాగేంద్రరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ దొడ్డవనేని సాంబశివరావు మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో దాత వేమిశెట్టి కిశోర్‌కుమార్ రూ.10వేల విలువైన వీల్‌చైర్‌ను సికింద్రాబాద్‌తండాకు చెందిన భూక్య రమేష్ అందజేశారు. అనంతరం అధ్యక్షుడిగా గూడూరు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వేమిశెట్టి కిషోర్‌కుమార్, కోశాధికారిగా జంగాల విజయ్‌కుమార్, నూతన సభ్యులుగా వనమాల సురేష్, రామరాజు శంతన్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సురేందర్, సత్యనారాయణ, నగేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, సదానందం, శ్రీనివాస్, గిరిధర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్‌ఓ తనిఖీ

దోర్నకల్: స్థానిక బిషప్ కాంపౌండ్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం ఫ్లైయింగ్ స్క్వాడ్ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ అధికారి కృష్ణమాచారి తనిఖీలు నిర్వహించారు. బిషప్ కాంపౌండ్‌లోని పలు ప్రాంతాల్లో అటవీశాఖ అనుమతి లేకుండా చెట్లు నరికారని, బిషప్ హౌజ్ పక్కన నిర్మిస్తున్న నూతన భవనానికి సంబంధించిన ఫర్నిచర్‌ను ఆయన తనిఖీ చేశారు.

ప్రచారోద్యమం నిర్వహించాలి



మాట్లాడుతున్న హరీశ్

మహబూబాబాద్ రూరల్: కుల, జనగణనకు ప్రచారోద్యమాన్ని నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న హిందుత్వ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా పోరాడుదామని ఎరుకల, వడ్డెర, ఎస్సీ, రజక కులసంఘాల బాధ్యులు కోట ఎల్లేష్, వల్లెపు రాజ్‌కుమార్, మందుల రవితేజ, నెల్లుట్ల అజయ్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి చారి హరీశ్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం(బి) గ్రామంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం చర్చాగోష్టి నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుల నిర్మూలన కోసం పోరాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన కుల, జన గణన అంశంపై గ్రామాలలో ప్రచార ఉద్యమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తుడుం గంగమ్మ, వెంకన్న, భద్రమ్మ, లిఖిత్, విక్టర్, చేగువేరా పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే విగ్రహానికి సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి శివారపు శ్రీధర్, నాగేశ్వర్‌రావు, రాజు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే ఈడీ దాడులు



మాట్లాడుతున్న కృష్ణగౌడ్

గార్ల: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటిపై రాజకీయ కక్షతోనే ఈడీ, ఐటీ దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణగౌడ్ ఆరోపించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు రావూరి వెంకట్రామయ్య, నాయకులు గుండా వెంకట్‌రెడ్డి, మాలోత్ వెంకట్‌లాల్, కొణతం సత్యనారాయణరెడ్డి, బానోత్ హతీరాం పాల్గొన్నారు. మంత్రి ఇంటిపై ఈడీ దాడులను పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు ఖండించారు.

బీజేపీ కుట్రలు మానుకోవాలి

బయ్యారం: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా ఈడీ దాడులు నిర్వహించటం మానుకోవాలని కాంగ్రెస్ మండల నాయకుడు సనప సోమేష్ అన్నారు. శనివారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట నాయకులు రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, గోపాల్ ఉన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



కేసముద్రం: కల్వల పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

స్వాతంత్య్ర సమరయోధులు, విప్లవకారుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశ అభ్యున్నతి కోసం నిరంతరం బ్రిటిష్ ప్రభుత్వంతో కొట్లాడిన మహానుభావుడు అని కొనియాడారు. నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సంఘం నాయకులు

విద్యుదాఘాతంతో కాడెద్దులు మృతి

మరిపెడ రూరల్: విద్యుదాఘాతంతో కాడెద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని మూలమ్రితండా గ్రామ పంచాయతీ శివారు వ్యవసాయ క్షేత్రంలో శనివారం చోటుచేసుకుంది. బాధిత కౌలు రైతు భూక్య బిచ్చ కథనం ప్రకారం.. మూలమ్రితండాకు చెందిన కౌలు రైతు భూక్య బిచ్చ వ్యవసాయ పనుల నిమిత్తం తన కాడెద్దులను తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో వ్యవసాయ క్షేత్రాల డొంక దారికి ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ తీగకు ఎద్దులు తగిలాయి. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన కాడెద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధిత దంపతులు బిచ్చ, లింగమ్మ బోరున విలపించారు.



మృతి చెందిన కాడెద్దుల వద్ద విలపిస్తున్న రైతు దంపతులు

'జమిలి' సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం



మాట్లాడుతున్న చంద్రన్న

నెహ్రూసెంటర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కూటమి మంత్రివర్గం ఆమోదించిన జమిలి ఎన్నికల విధానం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఒకే దేశం, ఒకేజాతి, ఒకే ఎన్నిక పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ రూపొందించిన హిందుత్వ సిద్ధాంతాన్ని ఎన్డీఏ పేరుతో అమలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, బండపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుర్రం జాషువా జయంతి వేడుకలు



మహబూబాబాద్ అర్బన్: జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నెహ్రూసెంటర్: నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: తెలుగు పద్య కవిత్వాన్ని మరో మలుపు తిప్పిన మహాకవి గుర్రం జాషువా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలుమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణమాసోత్సవం

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో శనివారం నేరడ సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణమాసోత్సవంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనిత, కార్యదర్శి యుగేందర్, అంగన్‌వాడీ టీచర్లు హేమలత, రాజేశ్వరీ, రమాదేవి, రేవతి, శ్రీదేవి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేసి నెలకు పింఛన్ రూ.4వేలు చెల్లించాలని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 1వ తేదీన చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరిసరాలను శుభ్రం చేసుకోవాలి

పెద్దవంగర: స్వచ్ఛ తా హి సేవా కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని తహసీల్దార్ మహేందర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అవుతాపురం గ్రామంలో చేపట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు సబిత, కార్యదర్శి ఉపేందర్, శ్రీనివాస్, కృష్ణమూర్తి శర్మ పాల్గొన్నారు.

మిత్రుడికి చేయూత

దోర్నకల్: దోర్నకల్ జెడ్పీహెచ్‌ఎస్ 1996–97 పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థి తన కుమారుడు, కుమార్తెను దోర్నకల్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదివిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఫీజు చెల్లించలేదంటూ ఇద్దరు పిల్లలను ఇంటికి పంపగా.. ఈ విషయాన్ని మరో మిత్రుడు సాదనాల రాము హైదరాబాద్‌లోని మిత్రుడు శంకర్ దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే స్పందించిన శంకర్ రూ.20వేల ఫీజు బకాయిని శనివారం పాఠశాల యాజమాన్యానికి ఫోన్ పే ద్వారా చెల్లించి స్నేహితుడికి చేయూతనందించాడు.

సరుకుల పంపిణీ

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలో ఇటీవల ఏర్పుల అంజయ్య కుమారుడు నరేష్ కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. కురవికి చెందిన యూట్యూబర్ గంగరబోయిన రఘు దాతలు బాదె రాజేశ్, పూల్ సింగ్ సహాయంతో రెండు నెలలకు సరిపడా 50కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బండారి శరత్, అఖిల్ పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ

దోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం హామీలన్నీ అమలు చేస్తుందని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం గ్యాస్ సబ్సిడీ వినియోగదారులకు మంజూరు పత్రాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చదువుతోపాటు శుభ్రత ముఖ్యం

బయ్యారం: విద్యార్థులకు చదువుతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం ముఖ్యమేనని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరస్వామి అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంతోష్‌తోపాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

రెబిస్‌పై అవగాహన అవసరం

దోర్నకల్: శునకాల ద్వారా వ్యాప్తి చెందే రెబిస్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మండల పశువైద్యాధికారి పి.నాగేశ్వర్‌రావు కోరారు. స్థానిక మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం ప్రపంచ రెబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎండీ రిజ్వానా, పశువైద్య సిబ్బంది చంద్రయ్య, వెంకన్న, సులేమాన్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

గార్ల: విద్యార్థులకు చదువులతోపాటు అన్నిరంగాల్లో రాణిస్తూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఐవి రాజకుమారి సూచించారు. శనివారం కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై జీనత్‌కుమార్, అప్పయ్య, హతీరాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

తొర్రూరు రూరల్: కుమారులు యోగ క్షేమాలు చూడటం లేదని మనస్తాపం చెందిన వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన నలమాస యాకాంత (75)కు ఇద్దరు కుమారులు వెంకన్న, యాకన్న, కుమార్తె వెంకటమ్మలు సంతానం. భర్త రామస్వామి ఏడాది క్రితం మరణించాడు. కుమారులు తల్లి బాగోగులు చూడడంలేదు. దీంతో మనస్తాపం చెందిన వృద్ధురాలు గ్రామంలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమార్తె వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైద్యపరికరాల బిల్లు చెల్లించండి

గార్ల: గార్ల సీహెచ్‌సీకి ఇచ్చిన ఎక్స్‌రే ప్లాంటు, వైద్య పరికరాల బిల్లులు చెల్లించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ శనివారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఏడాదిన్నర క్రితం.. నాటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ గార్ల సీహెచ్‌సీలో వైద్య పరికరాల కోసం తన సీడీఎఫ్ నిధులు రూ.20 లక్షలు ఇవ్వగా కాంట్రాక్టర్ వైద్య పరికరాలను ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. నేటికీ వైద్య పరికరాల బిల్లు రూ.20 లక్షలు చెల్లించకపోవడంతో పరికరాలను తిరిగి తీసుకెళ్తానని కాంట్రాక్టర్ వెల్లడించినట్లు లక్ష్మణ్‌నాయక్ కలెక్టర్‌కు వివరించారు. దీంతో బిల్లు చెల్లింపుపై పరిశీలిస్తానని కలెక్టర్ సమాధానమిచ్చారని లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి

కురవి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్ అన్నారు. శనివారం నల్లెల్ల గ్రామంలో సీరోలు మండలానికి చెందిన కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీరోలు మండల ఉపాధ్యక్షుడు వేణు, సుధాకర్, మహేష్‌గౌడ్ వెంకన్న పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

మరిపెడ రూరల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని మరిపెడ కాంప్లెక్స్ హెచ్‌ఎం అనంతరావు అన్నారు. మండలంలోని గాలివారి గూడెం యూపీఎస్ పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గుగులోతు వెంకన్న, లింగాల మహేష్‌గౌడ్, ఫైజుద్దీన్, బాలు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు కీసర రమేష్‌రెడ్డి, వెంకన్న, మురళీధర్, వీరన్న పాల్గొన్నారు.

కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

కేసముద్రం: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంపై కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని అమీనాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు సామ సుధాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, లింగాల నేతాజీ, జన్ను కట్టయ్య, ఇనుముల కరుణాకర్ పాల్గొన్నారు.